ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్

భూపాలపల్లి

ములుగు

శుక్రవారం 12 ఏప్రిల్ 2024



భూపాలపల్లిలోని కృష్ణకాలనీలో ఓ వ్యాపారి ఇంట్లో తనిఖీలు చేస్తున్న గణపురం ఎస్సై సాంబమూర్తి, సిబ్బంది



కాటారంలో వడ్డీ వ్యాపారి ఇంట్లో పత్రాలను స్వాధీనం చేసుకుంటున్న సీఐ నాగార్జునరావు



పేదలపై పెత్తనం!

- జిల్లాలో హద్దుమీరుతోన్న వడ్డీ వ్యాపారం
- ఎస్పీ ఆదేశాలతో ఏకకాలంలో దాడులు
- 12 మందిపై కేసులు నమోదు
- రూ.3,71,240 నగదు, పలు డాక్యుమెంట్లు స్వాధీనం
- ముందే సర్దుకున్న మరికొందరు వ్యాపారులు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఏప్రిల్ 11: సంపాదనే పరమావధిగా కొందరు వడ్డీ వ్యాపారులు పేదలపై పెత్తనం చెలాయిస్తున్నారు. తమ అవసరానికి ప్రైవేటు వడ్డీ వ్యాపారుల చేతికి చిక్కిన పేదలు అధిక వడ్డీలు చెల్లించలేక.. వారి వలయం నుంచి బయటపడలేక విలవిల్లాడుతున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆయా ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారులకు అడ్డుచెప్పే వారు లేకపోవడంతో వారి ఆగడాలకు అంతు లేకుండా పోతోంది. కుటుంబ, ఇతర అవసరాల నిమిత్తం అప్పుగా డబ్బులు తీసుకున్న వారంతా అనేక ఇబ్బందులు పడుతున్నారు. వారి నుంచి వ్యాపారులు రూ.3 నుంచి రూ.10 వరకు వడ్డీ లాగుతూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇక నెలవారీ, రోజువారి కలెక్షన్ల పేరుతో వడ్డీకి డబ్బులిచ్చి రూ.కోట్లు గడిస్తున్నారు. వీరి ఒత్తిళ్లు తట్టుకోలేక కొందరు ఇళ్లు వదిలి వెళ్లిపోతుంటే.. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటీవలే జిల్లా కేంద్రంలో ఓ వడ్డీ వ్యాపారి ఒత్తిడికి ఏడుకొండలు అనే చిరు వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు రావడం, అది నిజమేనని పోలీసులు నిర్ధారించడం కలకలం రేపుతోంది. ఇదే సమయంలో జిల్లా పోలీసు శాఖ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే ఎస్పీ ఇచ్చిన ఆదేశాలతో జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో ఏకకాలంలో పోలీసులు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు చేయడం పట్ల చర్చనీయాంశమైంది.

అందినకాడికి దండుకుంటూ..

జిల్లాలో అక్రమ వడ్డీ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. వడ్డీ వ్యాపారుల వద్దకు అప్పుకోసం వచ్చే వారి అవసరాలను బట్టి ఒక్కొక్కరికి ఒక్కో రకంగా వడ్డీ వసూలు చేస్తున్నారు. చిన్నచిన్న వ్యాపారులు, తోపుడుబండ్లు, తదితర వ్యాపారులు ఎక్కువగా ఏ రోజుకారోజు జరిగే వ్యాపారం మీద ఆధారపడి జీవిస్తుంటారు. అలాంటి వారు పెట్టుబడి కోసం డైలీ ఫైనాన్స్ వారిని ఆశ్రయిస్తే ఉదయం రూ.900 ఇస్తే.. సాయంత్రం మళ్లీ తిరిగి రూ.1000 వసూలు చేస్తున్నారు. మరికొందరు నెలకు రూ.9వేలు ఇస్తే.. నెల చివరి రోజున రూ.10వేలు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన పేదలు చేస్తున్న వ్యాపారంలో వచ్చే ఆదాయం సగం ఫైనాన్స్ వారికే చెల్లించాల్సి వస్తోంది. మరోవైపు డబ్బు చెల్లించడంలో ఆలస్యమైనా, మళ్లీ వారి వద్ద అప్పు తీసుకోకపోయినా.. వడ్డీ వ్యాపారులు పలు విధాలుగా ఒత్తిళ్లకు గురిచేస్తున్నట్టు తెలిసింది. ఇలా వడ్డీకి డబ్బులు ఇచ్చే సమయంలో ప్రామిసరీ నోట్లు, బ్యాంకు పాస్ బుక్కులు, లేదంటే ఏటీఎం కార్డులు ఇలా ఏదో ఒకటి విలువైన పత్రాల్ని జమానతుగా తీసుకుంటూ తదుపరి పేదలను ఇబ్బందులు పెడుతున్నారు.

అనుమతులపై అశ్రద్ధ..

ఎలాంటి అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం జిల్లాలో విచ్చలవిడిగా సాగుతోంది. ప్రధానంగా ఫైనాన్స్, తాకట్టు వ్యాపారాలు చేయాలన్నా నిబంధనలు ప్రకారం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ప్రధానంగా రెవెన్యూ రిజిస్ట్రేషన్, పోలీసు శాఖ ద్వారా లైసెన్సులు కలిగి ఉండాలి. లైసెన్స్‌లు పొందిన వారు మాత్రమే నియమ నిబంధనలకు లోబడి వ్యాపారాలు కొనసాగించాలి. కానీ, జిల్లాలో చాలా మందికి లైసెన్సు లేమి లేవు. ఏళ్ల తరబడి వడ్డీ వ్యాపారం చేస్తున్నా వారికి కూడా లైసెన్సులు లేవంటే వారికున్న అశ్రద్ధకు అద్దం పడుతోంది. ఈ తరుణంలోనే జిల్లా పోలీసు శాఖ ఎట్టకేలకు దృష్టి సారించి దాడులు చేయడంతో వ్యాపారులు జెంబేలెత్తి పోయారు. ఇదివరకు బాధితులెవరైనా అధిక వడ్డీలు తీసుకుంటున్నారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. వడ్డీ వ్యాపారులకే పోలీసులు వత్తాసు పలికేవారనే అపవాదు ఉంది. ఈ నేపథ్యంలో పోలీసులు తీసుకుంటున్న చర్యల పట్ల ఒకింత హర్షం వ్యక్తమవుతోంది.

కొందరు ముందే సర్దుకున్నారు..?

వడ్డీ వ్యాపారం చేసే వారి ఇళ్లపై పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. అయితే ఇందులో కొంత మంది ముందే సర్దుకొని జాగ్రత్త పడ్డట్లు ఆరోపణలు వస్తున్నాయి. పెద్ద మొత్తంలో దందా సాగించే వారిలో కొందరికి పోలీసులు వెసులుబాటు కల్పించారనే విమర్శలు వస్తుండగా.. సదరు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఏకకాలంలో ఎస్పీ ఆదేశాలతో దాడులు చేసిన పోలీసులు ఈ రకంగా వ్యవహరించడం ఏంటన్న గుసగుసలు తోటి వడ్డీ వ్యాపారుల నుంచే రావడం గమనార్హం. పక్కా సమాచారంతో మిగిలిన వారి ఇళ్లపై సైతం దాడులు చేసి చర్యలు తీసుకోవాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది.

12 బృందాలుగా ఏర్పడి దాడులు..

ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో బుధవారం రాత్రి పోలీసులు 12 బృందాలుగా ఏర్పడి ఆకస్మిక దాడులు చేశారు. భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్ ప్రాంతాల్లో దాడులు చేశారు. ఈ దాడుల్లో వడ్డీ వ్యాపారుల నుంచి 193 ప్రామిసరీ నోట్లు, 93 ఏటీఎం కార్డులు, 61 ఖాళీ చెక్కులు, 28 బ్యాంకు పాసు బుక్కులు, 109 బ్యాంకు చెక్కులు, 13 బాండ్ పేపర్లు, 11 పట్టా పాస్‌బుక్కులు, రూ.3,71,240 నగదు స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ దాడుల్లో సీఐలు నరేష్‌కుమార్, నాగార్జునరావు, రవీందర్‌తో పాటు ఎస్సైలు పాల్గొన్నారు.

అధిక వడ్డీ వసూలు చేసే వారి వివరాలివ్వండి : కిరణ్ ఖరే, ఎస్పీ



బాధితులెవరైనా అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారుల వివరాలను సంబంధిత పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలి. వారి వివరాలను గోప్యంగా ఉంచి తగిన న్యాయం చేస్తాం. అక్రమ వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారాలు చేస్తున్న వారి చేతుల్లో చిక్కి చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీ వ్యాపారం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా అలాంటి వారిని నమ్మి అప్పుగా డబ్బులు తీసుకోవద్దు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క



ముస్లిం మతపెద్దలు, చిన్నారులతో మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 11: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా గురువారం ములుగు జిల్లా కేంద్రంలో ఆమె ముస్లిం మతపెద్దలు, పలువురిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మంత్రిని ఆశీర్వదించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ రంజాన్ పండుగ మత సామరస్యానికి, సహృద్భావానికి, సర్వ మానవ సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. అల్లా దీవెనలతో రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ మానవాళికి సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని, దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ముగింపు వేడుక అని తెలిపారు. క్రమశిక్షణతో ఉండడం, ఐకమత్యంతో మెలగడం, పేదలకు తోడ్పాటు అందించడం ఈ పండుగ మానవాళికి ఇచ్చే సందేశమని, మనిషిలోని చెడు భావనలను, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని అన్నారు. కార్యక్రమంలో ముస్లింలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్‌కు ఫిట్స్..

మినీ ట్రావెల్ బస్సు బోల్తా

14 మంది ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదుట ఘటన



బోల్తా పడిన మినీ ట్రావెల్ బస్సు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఏప్రిల్ 11 : మినీ ట్రావెల్ బస్సును నడుపుతున్న డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో ఆ బస్సు బోల్తా పడింది. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రం మంజూర్‌నగర్‌లోని పాత కలెక్టరేట్ ఎదురుగా చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన మినీ ట్రావెల్ బస్సులో 14 మంది ప్రయాణికులు గురువారం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో మంజూర్‌నగర్‌లోని పాత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట డ్రైవర్‌కు ఫిట్స్ వచ్చింది. ఆ వెంటనే బస్సు అదుపు తప్పి రోడ్డు దిగి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎవరికీ గాయాలు కాలేదు. అదృష్టవశాత్తు డ్రైవర్‌తో సహా మిగిలిన వారంతా సురక్షితంగా బయటపడ్డారు. గమనించిన స్థానికులు ఫిట్స్‌తో బాధ పడుతున్న డ్రైవర్ కనిష్కకు ప్రథమ చికిత్స అందించారు. ఆ తదుపరి మరో వాహనంలో ప్రయాణికులంతా కాళేశ్వరం వెళ్లారు. బస్సు బోల్తా పడ్డప్పటికి ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కాగా, వాహనం ముందు అద్దాలు పగలడంతో పాటు ముందు భాగం ధ్వంసమైంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు.

కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించాలి

- దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరం
- మహబూబాబాద్ ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించాలి
- పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



వేలుబెల్లిలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కొత్తగూడ, ఏప్రిల్ 11 : దేశానికి ప్రస్తుతం రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరమని, ఆయన ప్రధానమంత్రి కావాలంటే మహబూబాబాద్ ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్నిచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి ఎన్నికల్లో గెలిపిచాలన్నారు. కొత్తగూడ మండలం వేలుబెల్లిలో గురువారం కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో గ్యారంటీలను అమలు చేశామన్నారు. చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లో రైతుబంధు వేశామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అవినీతిపరులు ఉన్నవారు బీజేపీలో చేరగానే సర్ఫ్‌తో ఉతికినట్టు నీతిపరులుగా మారుతున్నారని ఎద్దేవా చేశారు. వారికి పదవులను సైతం అప్పగిస్తున్నారని విమర్శించారు. నిత్యావసర సరుకులు, వస్తువులు, దుస్తులపై మోదీ ప్రభుత్వం అధిక పన్నులు వేస్తూ ప్రజలను వేధిస్తున్నదని ఆరోపించారు. ఎన్నికల కోడ్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఆగిపోయాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రంలో లేదు, దేశంలో రాదన్నారు. బలరాంనాయక్ కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేశారన్నారు. గత పదేళ్లుగా ఎంపీలుగా చేసిన వారు ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. ఎవరు ఎంపీగా పోటీ చేసినా రాహుల్‌గాంధీని పీఎం చేయడం లక్ష్యంగా భావించి బలరాంనాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు.

కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ మాట్లాడుతూ మంత్రి సీతక్కతో కలిసి కొత్తగూడ, గంగారం మండలాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. తనకు ఓటు వేస్తే రాహుల్‌గాంధీకి ఓటు వేసినట్టేనని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఎన్నికల ఇన్‌చార్జి అనిల్, జడ్పీటీసీలు పుష్పలత, రమ, ఎంపీపీ బానోత్ విజయ రూప్‌సింగ్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా నారాయణరెడ్డి, సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి సురేందర్, నాయకులు సుంకరబోయిన మొగిలి, వెంకన్న, అల్లాడి రాజు, వజ్జ రాకేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్‌కే పట్టం

మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత

ఏటూరునాగారం, ఏప్రిల్ 11: ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. కాంగ్రెస్ పార్టీవి 420 హామీలన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ ఫంక్షన్ హాల్‌లో గురువారం మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతితో కలిసి హాజ రయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి కవిత మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రజలు దేవుడిలా కొలుస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం కోసం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మదిలో గూడుకట్టుకున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చి హామీలను ప్రజలు నమ్మి మోసపోయి బాధపడుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఆడపడుచులకు తులం బంగారం, ప్రతీ మహిళకు రూ.1500 హామీ ఏమైందని, ఉచిత కరెంటు ఇవ్వడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఇసుక మాఫియాతో కుమ్మక్కై దందా కొనసాగిస్తున్నారని, తమ పదేళ్ల పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాలు ఎంతో అభివృద్ధి చెందాయని, ఆ ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ చొరవతో ములుగును జిల్లాగా చేసి ఆయా కార్యాలయాల్లో ఉన్నత స్థాయి అధికారులను నియమించి ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీ, మెడికల్ కళాశాల, మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం, ములుగు ఆస్పత్రుల్లో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేసి రోగులకు మెరుగైన వైద్యం తమ ప్రభుత్వమే అందించిందని చెప్పారు.

ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ హామీని అమలు చేయకపోవడంతో రాష్ట్రంలో పంట పొలాలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కవితను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో 12లక్షల ఉద్యోగ నియామకాలు భర్తీ చేశామన్నారు. మల్లంపల్లిని మండలంగా, ఏటూరునాగారాన్ని నూతన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను లిక్కర్ స్కాం పేరుతో కాంగ్రెస్ పార్టీ జైలుపాలు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ఆమె మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవిందనాయక్, జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎమ్డీ.వలియాబీ, ఎంపీపీ అంతటి విజయ, వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, నాయకులు కాకుమార్రి ప్రదీప్‌బాబు, తుమ్మ మల్లారెడ్డి, కూనూరు మహేష్, ఈట్ల ఈశ్వర్, దొడ్డ కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంధకారంలో జాతీయ రహదారి

- రోడ్డు పూర్తయినా వెలగని వీధిలైట్లు
- పట్టించుకోని అధికారులు

వివరాలు 8లో..



మహదేవపూర్ మండల కేంద్రంలో అంధకారంలో ఉన్న జాతీయ రహదారి

మోదీ బృందంలో అవకాశం ఇవ్వండి..

- ఇద్దరం ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాం
- వరంగల్ కోసం మోదీ ఎంతో చేశారు
- మాల, మాదిగలను అణగదొక్కిన కడియం
- కావ్యకు వరంగల్‌తో ఏం సంబంధం? ఆమె మెట్టినిల్లు గుంటూరు
- హామీలు నెరవేర్చని కాంగ్రెస్
- బీజేపీ లోక్‌సభ అభ్యర్థులు సీతారాంనాయక్, అరూరి రమేష్
- బీజేపీలోకి పెద్ద ఎత్తున చేరికలు

7లో..



మాట్లాడుతున్న బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, పక్కన మానుకోట అభ్యర్థి సీతారాంనాయక్, గరికపాటి



ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

డీఎస్పీ సంపత్‌రావు

రేగొండ, ఏప్రిల్ 11 : ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ సంపత్‌రావు సూచించారు. రేగొండ మండల కేంద్రంలో గురువారం ప్రమాదాల నివారణపై ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై మాట్లాడుతూ శిక్షణ పొందిన డ్రైవర్లు మాత్రమే ట్రాక్టర్లను నడపాలన్నారు. అదేవిధంగా రాత్రి పూట ప్రమాదాలు జరగకుండా ఉండడానికి ట్రాక్టర్స్ ట్రాలీలకు రేడియం స్టిక్కర్లు అంటించుకోవాలని సూచించారు. ప్రతీ వాహనానికి నెంబర్ ప్లేట్ ఉండాలని, లైసెన్సు, ఇన్సూరెన్సు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో చిన్నచిన్న రోడ్లు ఉండడం ద్వారా పరిమితమైన వేగంతో వాహనాలు నడపాలని అన్నారు. సుమారు 100 ట్రాక్టర్లకు పోలీసుల ఆధ్వర్యంలో రేడియం స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్, ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

WANTED

Join our team at SPR School of Excellence, Yellapur, Hanamkonda!

We are looking for dedicated teachers in various subjects:-

*Telugu Lower-1 *Hindi Higher-1 *English Higher-1, *Lower-2 *Maths IIT-2, *Physics IIT-1, *Biology-1 *Social Middle-1 *Art Teacher-1 *Music Teacher-1 *Male Pets - 3 *Female Pets-2 *Wardens Male - 8, *Wardens Female - 05 *Lady Receptionist -1 *Medical incharge (Male)

• Teachers are conversing fluently in English • Eligible candidates who are qualified are suitable for the respective position
• Preference is given to teachers with experience

Interview On 14th April, 2024. Time : 9.00 am to 1.00 pm

Interested candidates are requested to attend the exam (Only Teachers) with Original Certificates without fail

Venue SPR State & CBSE Syllabus

SCHOOL OF EXCELLENCE

RESIDENTIAL CAMPUS

YELLAPUR, HASANPARTHY, HANAMKONDA

Contact: 9246905445,9440987399

Economy Classified Display COLOUR CLASSIFIED DISPLAY

ఆంధ్రజ్యోతి లో ప్రకటన ఇవ్వండి - అధిక ప్రచారం పొందండి

బ్లాక్ & వైట్ స్కేర్ సెం.మీ. Rs.170/-

ప్రతి మంగళవారం & శుక్రవారం కలర్ స్కేర్ సెం.మీ. మాత్రమే Rs. 220/-

సింగిల్ మరియు డబుల్ కాలమ్స్ మాత్రమే...

వివరాలకు సంప్రదించగలరు

హన్మకొండ : 9985411677, 9985411676,
వరంగల్ : 9985406150, 9985408173
జనగామ : 9866431354, మహబూబాబాద్ : 9985418040
తొర్రూరు : 9985408003 జయశంకర్ : 9985401232





















‘ఖజానా’లో పని భారం

100 మంది ఉద్యోగులు చేయాల్సిన పనికి 45మందే దిక్కు

35వేల పై చిలుకు ఉద్యోగులకు ఇక్కడినుంచే జీతాలు చెల్లింపు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 11: హైదరాబాద్ ఖజానా కార్యాలయం తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఖజానా కార్యాలయమైన హనుమకొండ జిల్లా ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. ఇక్కడి కార్యాలయంలో 100 మంది ఉద్యోగులు చేయాల్సిన పనిని.. 45 మంది ఉద్యోగులే చేస్తూ అధిక పనిభారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న ఆరు జిల్లాల ఖజానా కార్యాలయాలలో 5 జిల్లాల ఖజానా కార్యాలయాల ఉద్యోగులు చేసే పనిని ఒక్క హనుమకొండ జిల్లా కార్యాలయ ఉద్యోగులు చేస్తున్నారంటే వారిపై ఎంత పనిభారం ఉందో అర్థమవుతోంది.

అన్నీ నుంచే..

జిల్లాలోని కొందరు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్లు ఈ కార్యాలయం నుంచే ఇస్తారు. 15వేల మంది ఉద్యోగస్తులకు, 16వేల మంది పెన్షనర్లకు, 1200 మంది హోంగార్డులకు, 1500 మంది మున్సిపల్ సిబ్బందికి, 1000 మంది గ్రాంటినేట్ స్కూల్ టీచర్లకు, 500 మంది అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు(35వేల పైచిలుకు ఉద్యోగులకు) ఇక్కడి నుంచే చెల్లిస్తారు. దీంతో పాటు జిల్లాలోని 110 గ్రామ పంచాయతీల సిబ్బందికి వేతనాలతో పాటు సాధారణ నిధులు కూడా ఇక్కడి నుంచే విడుదలవుతాయి.

అన్ని రోజులూ పనిదినాలే...

ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల కొరత ఉండటంతో ఆదివారాలు, పండగ రోజులు కూడా ఉద్యోగాలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. నూతన పెన్షన్ విధానం, ఆదాయ పన్ను రిటర్న్‌కు సంబంధించిన పనులు, క్యాష్ ఇన్ జీపీఎఫ్ చెల్లింపులు కూడా ఇక్కడి నుంచే చేస్తుండటంతో ఎక్కువ పనిభారంతో సతమతమవుతున్నామని ఖజానా కార్యాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఖజానా కార్యాలయంలో సరిపడా ఉద్యోగులను కేటాయించాలని కోరుతున్నారు.

పెన్షన్ పేమెంట్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.నరసింహారెడ్డి



హనుమకొండ జిల్లాలో 16వేల మంది పెన్షనర్లు ప్రతీ నెల పెన్షన్ తీసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లా ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల కొరత ఉండటంతో పెన్షనర్లకు ఇబ్బంది ఎదురవుతోంది. ఖజానా కార్యాలయ ఉద్యోగులకు పనిభారం తగ్గాలంటే పెన్షన్ పేమెంట్ ఆఫీస్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. ఇలాంటి ఆఫీస్‌లు హైదరాబాద్‌లో మాత్రమే ఉన్నాయి. హైదరాబాద్ తర్వాత ఎక్కువ పెన్షనర్లు ఉన్న మన హనుమకొండ జిల్లాలో కూడా పెన్షన్ పేమెంట్ ఆఫీస్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఖదిజ్ఞాసి లోక్‌నాథ్

ఓటు అమ్ముకుంటే ఐదేళ్లు అధోగతే..

జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోక్‌నాథ్

వడ్డెపల్లి, ఏప్రిల్ 11 : నోటుకు ఓటు అమ్మకుంటే ఐదేళ్ల భవిష్యత్ అధోగతేనని జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోక్‌నాథ్ అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్బుకు ఓటు అమ్ముకుంటే బతికి ఉన్నా శవంతో సమానమన్నారు. ధన రాజకీయాలకు ఎన్నికల్లో సమాధి కట్టాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యత ఓటర్ల పైనే ఉందని చెప్పారు. సమావేశంలో జై భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సత్యనారాయణ గోల, రాష్ట్ర నేత ఖదిజ్ఞాసి వీరయ్య, సాంబశివ రావు, గగన్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్ట ఆలయాలను విలీనం చేయవద్దు..

రామాలయ అర్చకుడు విష్ణువర్ధనాచార్యులు ఆత్మహత్యాయత్నం



మెట్టుగుట్ట ఆలయాలను విలీనం చేయవద్దని తీర్మానం చేస్తున్న ఈవో, చైర్మన్, అర్చకులు, ధర్మకర్తలు, భక్తులు

మడికొండ, ఏప్రిల్ 11: మడికొండలోని మెట్టుగుట్టపై హరిహర క్షేత్రంగా విలసిల్లుతున్న మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయం అర్చకుడు పరాశరం విష్ణువర్ధనాచార్యులు ఆలయంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమీంపంలో ఉన్న కొందరు గమనించి వారించి నచ్చజెప్పి ఈవోకు సమాచారం అందించారు. కాగా, మడికొండలోని మెట్టుగుట్టపై హరిహర క్షేత్రంగా విలసిల్లుతున్న మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాలకి సంబంధించిన రెండు కమిటీలు ఉంటాయి. ప్రస్తుతం రామాలయానికి సంబంధించిన భూమిని రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ ఎనకు అమ్మగా కోట్ల రూపాయల నిధులు వచ్చాయి. ఆ నిధులపై కన్నేసిన దేవాదాయ శాఖ అధికారులు, ఈవో, శివాలయం అర్చకులు, చైర్మన్‌లు.. రామాలయం, శివాలయం రెండింటినీ విలీనం చేసి నిధులను ఇతర అవసరాలకు మళ్లించేందుకు నిర్ణయాలు తీసుకుంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఆలయాలను విలీనం చేయవద్దని నిరసన వ్యక్తం చేస్తూ అర్చకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

దీనిపై ఈవో శేషభారతి ఆలయ చైర్మన్, అర్చకులు, ధర్మకర్తలు, స్థానికులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ప్రస్తుతానికి ఆలయాల విలీనం వంటి చర్యలు ఏవీ చేయడంలేదని తీర్మానం చేసినట్లు స్పష్టం చేశారు. అలాగే రామాలయ అర్చకులకు పే స్కేల్ వచ్చే విధంగా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, ధర్మకర్తలు, కరుణాకర్‌రెడ్డి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న విమానం!

దశాబ్దాలుగా నెరవేరని గగన విహారం ● భూసేకరణ, 150కి.మీ నిబంధనల అడ్డంకి దాటితేనే మార్గం సుగమం

వరంగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఓరుగల్లు వాసులకు 'విమానం' ఊరిస్తోంది. గగన విహారం కలగానే మిగులుతోంది. చిన్న నగరాలకు రాష్ట్ర రాజధానులు, డిల్లీతో ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉడాన్ పథకం ఉత్తుత్తిగానే మిగిలిపోతోంది. అయితే ఉమ్మడివరంగల్ జిల్లా అభివృద్ధికి ఎంతో కీలకంగా ఉంటుందన్న లక్ష్యంతో మామునూరు ఎయిర్‌పోర్టుకు 2021లోనే ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సూత్రప్రాయంగా అనుమతులిచ్చింది. అయితే ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణతో పాటు హైదరాబాద్ విమానాశ్రయానికి 150కిలో మీటర్ల పరిధిలో మరో విమానశ్రాయం నిర్మించవద్దనే ఒప్పందం వరంగల్ ఎయిర్‌పోర్టుకు శాపంగా మారుతుంది. అయితే తాజాగా వారం రోజులుగా మామునూరు ఎయిర్‌పోర్టులో విమానాలు సందడి చేస్తున్నాయి. మూడు సర్వే విమానాలు మామునూరు రన్‌వేపై దిగటంతో విమానశ్రాయం కల సాకారమవబోతోందన్న ఆశలు చిగురిస్తున్నాయి.

నిజాంకాలం నుంచే ఎయిర్‌పోర్టు..

నిజాం కాలంలోనే రయ్ రయ్ మంటూ విమానాలు ఎగిరిన మామునూరులో.. నేటి తరానికి గగన ప్రయాణం అందుబాటులో లేకుండాపోయింది. 1930లో చివరి నిజాం మీర్ ఉస్మాన్‌అలీ ఖాన్ మామునూరులో విమానాశ్రయం ఏర్పాటు చేశారు. షోలాపూర్‌లోని వ్యాపారాభివృద్ధికి, ఆజంజాహి వస్త్ర పరిశ్రమ, కాగజ్‌నగర్ కాగితపు పరిశ్రమలకు ఉపయోగపడేలా దీన్ని ఏర్పాటు చేశారు. 1981 వరకు మామునూరు విమానాశ్రయం ద్వారా రాకపోకలు జరిగాయి. 1970లో భారత్, చైనా మధ్య జరిగిన యుద్ధం సందర్భంగా డిల్లీలో విమానాలు దిగే పరిస్థితి లేనప్పుడు కూడా మామునూరు నుంచే సైన్యాన్ని పంపారు. కార్గిల్ యుద్ధ సమయంలో కూడా డిల్లీ ఎయిర్‌పోర్టుకు ప్రత్యామ్నాయంగా మామునూరు ఎయిర్‌పోర్టును వాడుకునేందుకు సిద్ధం చేశారు. ఇలాంటి చరిత్ర ఉన్న మామునూరు విమానాశ్రయం ఓరుగల్లువాసులకు మాత్రం ఉపయోగపడటం లేదు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మామునూరు విమానాశ్రయాన్ని బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. 2017 ఏప్రిల్ 27న ఉడో దేశ్‌కీ ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద దేశవ్యాప్తంగా విమానాశ్రాయాలను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ఓఎల్‌ఎస్ సర్వే, మట్టి పరీక్షతో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గతేడాది జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతో మామునూరు ఎయిర్‌పోర్టుకు అన్ని రకాల అనుమతులు లభించాయి.

భూసేకరణ, 150కి.మీ నిబంధనే అడ్డంకి..

'అంగట్లో అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని' అనే చందంగా మామునూరు ఎయిర్‌పోర్టుకు అన్ని అనుమతులున్న భూసేకరణ, 150కిలో మీటర్ల నిబంధన ప్రతిబంధకంగా మారింది. నిజాం కాలంలో 1,875ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు కోసం కేటాయించారు. ఇందులో 435ఎకరాల భూమిని టీఎస్‌ఎస్‌పీ ఫోర్తు బెటాలియన్ క్యాంపునకు కేటాయించారు. ఇందులో నుంచే జవహర్ నవోదయ విద్యాలయానికి 23.20ఎకరాలు, పోలీస్ శిక్షణ కళాశాలకు 59ఎకరాలు, ఏసీపీ కార్యాలయానికి పదెకరాలు, వరంగల్ సెంట్రల్ జైలుకు 101 ఎకరాలు కేటాయించారు. ఇక ఫోర్త్ బెటాలియన్‌కు మిగిలింది కేవలం 241.24ఎకరాలు. మరో 675 ఎకరాల భూమిని వెటర్నరీ యూనివర్సిటీకి కేటాయించారు. రోడ్డు, ఇతర వాటికి పోగా ప్రస్తుతం 696 ఎకరాల స్థలం ఎయిర్‌పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. అయితే ఎయిర్‌పోర్టుకు 1,200ఎకరాల భూమి అవసరం. ఇంకా 504ఎకరాల భూమిని సేకరించి ఇవ్వాల్సి ఉంది. 2023 జూలై నెలలో 249 ఎకరాలు వెటర్నరీ యూనివర్సిటీ పక్కనే ఉన్న భూమి సేకరించి ఎయిర్‌పోర్టుకు ఇచ్చేందుకు గత ప్రభుత్వ మంత్రివర్గం ఆమోదించింది. మిగతా భూమిని చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతుల భూములు సేకరించాలని నిర్ణయించారు. అయితే ఎయిర్‌పోర్టుకు భూమిని అప్పగించేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. దీంతో విమానాశ్రయ ఏర్పాటుకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. అలాగే హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందం మేరకు 150కి.మీ నిడివిలో ఇంకో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మామునూరు 150కిలో మీటర్ల లోపే ఉంది. దీంతో 2038వరకు మామునూరు ఎయిర్‌పోర్టుకు మోక్షం లభించదనే నిరాశ ఓరుగల్లు వాసుల్లో నెలకొంది. అయితే ప్రభుత్వం చొరవచూపించి జీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి, నిబంధనలను సడలించాలనే ప్రజలు చేస్తున్న విజ్ఞప్తిని పట్టించుకునే వారు లేరు.

ఆశలు రేకెత్తిస్తున్న విమానాల సందడి..

మామునూరు ఎయిర్‌పోర్టులో గురువారం మూడు హెలికాప్టర్లు సందడి చేశాయి. వారం రోజులుగా ఒకటి రెండు విమానాలు మామునూరు ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావటం, గగన విహారం చేయటం జరుగుతోంది. అయితే వాటిని ఎన్‌సీసీ విభాగానికి చెందిన హెలికాప్టర్లుగా భావించగా.. గురువారం మూడు హెలికాప్టర్లు ఒకేసారి మామునూరులో



ఎయిర్‌పోర్టుకు కేటాయించిన భూమి

ల్యాండ్ కావటంతో పాటు స్కై సర్వే చేపట్టారు. మూడు హెలికాప్టర్లలో వచ్చిన సిబ్బంది జియోజికల్ సర్వే చేపట్టినట్టు అక్కడి సిబ్బంది తెలిపారు. ఏఏఐ అనుమతితో కొన్ని విమాన ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఇక్కడ ల్యాండింగ్‌కు ఉన్న వెసులుబాటును పరిశీలించారు. ఇప్పటికే మామునూరులో 6.6కి.మీ రన్‌వేతో పాటు పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 700 ఎకరాల వరకు భూమి ఉంది. వీటిని పరిశీలించిన అధికారులు పెద్దపల్లి జిల్లా రామగుండం ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రదేశాన్ని కూడా ఎయిర్ వ్యూ చేశారు. అనంతరం మామునూరుకు చేరుకున్నారు. మరో రెండుమూడు రోజులు ఇతర సర్వేలు చేపట్టనున్నట్లు సమాచారం. అయితే ఈ సర్వేలు ఎందుకోసమో వివరించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. కేంద్ర విమానాయ శాఖ ఆదేశాల మేరకే ఈ సర్వేలు జరుగుతుండటంతో ఓరుగల్లువాసుల్లో గగనయానంపై ఆశలు చిగురిస్తున్నాయి.

విమానయానంతో వ్యాపారాభివృద్ధి...

విమానాశ్రాయం ఏర్పడితే వరంగల్‌లోపర్యాటకంతో పాటు వ్యాపారాభివృద్ధి జరుగనుంది. పరిశ్రమలన్నీ హైదరాబాద్‌కే పరిమితమవుతుండగా.. హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్‌కు పరిశ్రమల స్థాపనకు వ్యాపారులు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం ఎయిర్‌పోర్టు లేకపోవటమేనని తెలుస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 140కిలో మీటర్లు రోడ్డు మార్గాన వరంగల్‌కు రావాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా అవుతుందనే కారణంతో పారిశ్రామికంగా అనుకూల వాతావరణం ఉన్నా విమానాశ్రయం లేకపోవటంతో వరంగల్‌లో పరిశ్రమలు రావటం లేదనే చర్చ జరుగుతోంది. వరంగల్‌లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు అనేక విదేశీ కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయి. అయితే డిల్లీ, హైదరాబద్‌తో ఎయిర్ కనెక్టీవిటీ లేకపోవడంతో పారిశ్రామిక వేత్తలు ముందుకు రావటం లేదు. అలాగే మడికొండ ఏరియాలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు కూడా ఎయిర్ కనెక్టీవిటీ లేకపోవటమే కారణంగా చెబుతున్నారు. భూపాలపల్లి ఏరియాలో అపార బొగ్గు నిక్షేపాలు ఉండగా.. ఇక్కడ బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నా విమాన మార్గం లేకపోవటంతో పారిశ్రామికవేత్తలు ముందుకు రావటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం జీఎంఆర్ సంస్థతో చర్చలు జరిపి మామునూరు ఎయిర్‌పోర్టుకు 150కి.మీ మినహాయింపు సడలించేలా ఒత్తిడి తెచ్చి, దశాబ్దాల కల సాకారం అయ్యేలా దృష్టిపెట్టాలని ఓరుగల్లువాసులు కోరుతున్నారు.

నేడు బీజేపీ లోక్‌సభ బూత్ స్థాయి సమ్మేళనం

హనుమకొండ టౌన్, ఏప్రిల్11: వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని 7 నియోజకవర్గాల బీజేపీ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంను శుక్రవారం మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ తెలిపారు. ప్రతీ బూత్ నుంచి సమ్మేళనంలో పాల్గొని, విలువైన సలహాలు ఇచ్చి సీటు కైవసం చేసుకునేందుకు దోహదం చేయాలన్నారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు



కేయూ రోడ్డులో నిర్మాణాలు పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 11: బల్దియా పరిధిలో నిబంధనలు పాటిస్తేనే భవనాలకు అనుమతి పత్రాలు జారీ చేస్తామని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. నిర్మాణం పూర్తయిన భవనాలకు అక్యుపెన్సీ సర్టిఫికెట్‌ల మంజూరు కోసం గురువారం నగరంలోని పలు చోట్ల క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కేయూ మెయిన్‌గేట్, పరిమళకాలనీ, ప్రకాశ్ రెడ్డిపేట, న్యూశాయంపేట, నక్కలగుట్ట ప్రాంతాల్లో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. భవణాల నిర్మాణాల పట్ల కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ వెంట టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

33 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 11: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్‌లో 33క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వంగపహాడ్ గ్రామంలో ఎం.కోమల, రమక్క అనే ఇద్దరు మహిళలు పీడీఎస్ బియ్యం సేకరించి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. దాడిలో రూ.87వేల విలువైన 33 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధృవీకరించారు.

మోదీ బృందంలో ఉండే అవకాశం ఇవ్వండి..

బీజేపీ లోక్‌సభ అభ్యర్థులు అజ్మీరా సీతారామ్‌నాయక్, అరూరి రమేష్

హనుమకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని, ఆయన టీమ్‌లో తాము కూడా భాగస్వాములమయ్యే అవకాశాన్ని కలిగించాలని బీజేపీ లోక్‌సభ మహబూబాబాద్, వరంగల్ అభ్యర్థులు సీతారాం నాయక్, అరూరి రమేష్ ఓటర్లను అభ్యర్థించారు. తమను గెలిపిస్తే ఇద్దరం కలిసికట్టుగా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం హనుమకొండలోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీతారామ్‌నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేసిన తనను దూరంగా పెట్టి తెలంగాణ ద్రోహులకు టికెట్లిచ్చారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డిని మానుకోటకు తీసుకువచ్చిన రెడ్యానాయక్‌కు, ఆయన కూతురు కవితకు కేసీఆర్ టికెట్లిచ్చారన్నారు. అయినా కూడా తాను ఎంతో సహనంతో బీఆర్ఎస్‌లో కొనసాగినప్పటికీ చివరికి బయటకు వెళ్లిపోయే పరిస్థితిని కల్పించారన్నారు. తాను ఎంపీగా మహబూబాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేశానని చెప్పారు. ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటులో, రామప్పకు యునెస్కో గుర్తింపు తీసుకురావడంలో, కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ స్థానంలో ఓవర్ హాలింగ్ వ్యాగన్ వర్క్‌షాపు స్థాపనకు, ఇంకా ఇతరత్రా అనేక ప్రాజెక్టులు తీసుకురావడంలో ఎంతో కృషి చేశానని వివరించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు మహబూబాబాద్ లోక్‌సభ నియోజకరవ్గం పరిధిలో పలు అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా కేసీఆర్ అడ్డుపడ్డారన్నారు.

తెలంగాణలో కేసీఆర్ అనుసరించిన పలు దుర్మార్గపు విధానాల వల్లనే కాంగ్రెస్ గెలిచిందని, అంతేకానీ ఆ పార్టీ పట్ల ప్రజల్లో ప్రేమ ఉండి కాదని సీతారామ్ నాయక్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని ప్రొఫెసర్ సీతారామ్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేస్తానని చెప్పిన వాగ్దానాల్లో ఒకటీ రెండు తప్ప.. ఏవీ అమలు కాలేదన్నారు రాష్ట్రంలో కాంగ్రెస్ వల్లనే కరువు వచ్చిందన్నారు. రాష్ట్రంలో కరువుకు గురైన మండలాలను ప్రభుత్వం ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. దేశంలో సుస్థిర పాలన, సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణ ఒక్క మోదీ వల్లనే సాధ్యమవుతుందని, ఆయనను చూసి ఓటేయ్యాలని సీతారామ్‌నాయక్ కోరారు. అయోధ్యలో రామమందిరం స్థాయిలో భద్రచాలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి మోదీని లోక్‌సభ ఎన్నికల తర్వాత తీసుకువస్తానన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 17 స్థానాలు బీజేపీ ఖాతాలో పడేలా ఓటర్లు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అభ్యర్థించారు.



బీజేపీలో చేరుతున్న పలువురు బీఆర్ఎస్ నాయకులు

వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ మాట్లాడుతూ.. మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని కాబోతున్నారని, ఆయన టీమ్‌లోకి తనను, సీతారామ్ నాయక్‌ను పంపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పని చేసిన తాను.. ఎమ్మెల్యేగా పదేళ్లు వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు అవకాశం వచ్చిందని, ఈ దృష్ట్యా ఓటర్లు తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కడియం శ్రీహరి మాల, మాదిగల ద్రోహిగా అరూరి అభివర్ణించారు. ఆయన ఉపముఖ్యమంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా టీడీపీలో, బీఆర్ఎస్‌లో పలు పదవులను అనుభవించినా ఎస్సీ సామాజికవర్గం అభ్యున్నతికి ఏ మాత్రం కృషి చేయలేదన్నారు. తన సొంత లాభం కోసం ఆరాటపడ్డారన్నారు. ఇప్పుడు తన కూతురును రాజకీయాల్లోకి తీసుకురావడానికి అడ్డదారులు తొక్కాడని విమర్శించారు. కడియం కూతురు, ప్రస్తుతం వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీకి దిగిన కావ్యకు వరంగల్‌తో ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఆమె అత్తగారు ఊరు గుంటూరని అన్నారు. శ్రీహరి కుటిల రాజకీయాలతో మాలలు, మాదిగలను ఆగం చేశాడన్నారు. లోకసభ ఎన్నికల్లో కడియంకు ఓటర్లు బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు.

ప్రస్తుతం యావత్ ప్రపంచం మోదీ వైపు చూస్తోందని, దేశ సర్వతో ముఖాభివృద్ధికి, రక్షణకు మోదీ నాయకత్వం అవసరమని అరూరి రమేశ్ అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ స్మార్ట్ సిటీ, అమృత్, గిరిజన విశ్వవిద్యాలయం, వ్యాగన్ వర్క్‌షాపు వంటి అనేక పథకాల ద్వారా వరంగల్‌కు ఎంతో చేశారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, బీజేపీ మహబూబాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గరికెపాటి మోహన్‌రావు, మాజీ ఎంపీ చాడా సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రావు అమరేందర్ రెడ్డి, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం బీఆర్ఎస్‌తో పాటు వివిధ పార్టీల నుండి పలువురు బీజేపీలో చేరారు. వీరికి గరికపాటి మోహన్ రావు, ప్రొఫెసర్ సీతారామ్‌నాయక్, ఆరూరి రమేష్‌లు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు ములుగు జిల్లా రైతు బంధు అధ్యక్షుడు పల్ల బుచ్చయ్య, రామప్ప పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పాలంపేట మాజీ సర్పంచ్ అకిరెడ్డి వెంకట రామ్మోహన్ రావు, ఏటూరునాగారం మాజీ ఎంపీటీసీ ఇర్రల్ల ఎల్లయ్య, బీఆర్ఎస్ ఏటూరు నాగారం కన్వీనర్ పల్ల బాబు, ఏటీఎంఏ డైరెక్టర్ పాపక శ్రీనివాస్‌తోపాటు పల్ల వెంకటేశ్వర్లు, పూజారి సూర్యనారాయణ, మధుకర్, నాగేశ్వర్‌రావు, పల్ల సృగన్, ఆకుతోట దుర్గయ్య తదితరులు వీరిలో ఉన్నారు. బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ములుగు జిల్లా ఇన్‌చార్జి పోలేపల్లి నరోత్తం రెడ్డి తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

ఒకవైపు విధులు.. మరో వైపు కళలు..

- **వ్యాఖ్యాత, రచయిత, గాయకుడిగా ప్రవీణ్‌కుమార్ రాణింపు**
- **హనుమకొండ జిల్లా బాలల పరిరక్షణ అధికారిగా విధులు**



జూలైవాడ, ఏప్రిల్ 11: సభలోని ఆహూతులను తన మాటలతో ఆకట్టుకొని, సందర్భోచిత కవితలు, పాటల ద్వారా సభికులను ఉత్సాహపర్చడం వ్యాఖ్యాత విధి. సాహితీ, కళా ప్రక్రియలలో భాగమైన వ్యాఖ్యానానికి తనదైన శైలిలో న్యాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు సౌరం ప్రవీణ్ కుమార్. హనుమకొండ జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అనుబంధ సంస్థ జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో బాలల పరిరక్షణ అధికారిగా (ఒప్పంద ప్రాతిపదికన) విధులు నిర్వహిస్తూ ప్రవృత్తి పరంగా కవిగా, రచయితగా, గాయకుడిగా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వ్యాఖ్యాతగా తన ప్రతిభను చాటుతున్నాడు.

చిన్ననాటి నుంచే కళారంగంపై ఆసక్తి

వరంగల్ జిల్లా సంగెం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన సౌరం ప్రవీణ్‌కుమార్.. సంగెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించాడు. ఆ రోజుల్లోనే కళా రంగంపై ఆసక్తి పెంచుకున్నాడు. అనంతరం వరంగల్‌లో ఇంటర్, డిగ్రీ అనంతరం సోషల్ వర్క్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక వేదికలపై జానపద, సామాజిక చైతన్య గీతాలు పాడి ప్రముఖుల ప్రశంసలు పొందాడు.

పాటకు తొలి గురువులు

కళాశ్రీ ప్రవీణ్‌గా ద్వితీయ నామకరణంతో సాహితీ సాంస్కృతిక రంగంలో ఆరంగ్రేటం చేసిన ప్రవీణ్ కుమార్.. తొలుత పలు జానపద కళా బృందాలతో కలిసి వారి పాటలకు వంతపాడేవాడు. అనతికాలంలో దివంగత వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి లాంటి అగ్రశ్రేణి గాయకులతో కలిసి అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో తనగళం వినిపించాడు. రచనా వ్యాసంగం వైపు దృష్టి మళ్లించి వర్ధమాన కవిగా, రచయితగా అనేక వేదికలపై తనను తాను నిరూపించుకున్నాడు. 2018 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమం అయినా, ఏదేని సాహితీ సాంస్కృతిక కార్యక్రమమైనా వ్యాఖ్యాతగా కళాశ్రీ ప్రవీణ్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.

ఉన్నతాధికారుల సహకారంతో..

ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో కవుల సమక్షంలో చెత్తబండి దీర్ఘ కవిత సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించి ప్రముఖులతో శభాష్ అనిపించుకొని అదే వేదికపై కణిక ఆత్మీయ పురస్కారం అందుకున్నాడు. ఉన్నతాధికారుల సహకారంతో జిల్లాలో నిర్వహించిన పలు కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.



వివిధ కార్యక్రమాలలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న సౌరం ప్రవీణ్ కుమార్ (ఫైల్)

'కవి సాయంత్రం' ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షురాలిగా రాధిక నరేన్



వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 11: సాహిత్య స్వచ్ఛంద సేవా సంస్థ, జనజాగృతి కళా సమితిలో అంతర్భాగమైన కవి సాయంత్రం సోషల్ మీడియా గ్రూప్ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీలో ఉపాధ్యక్షురాలిగా కొత్తపల్లి రాధిక నరేన్‌ను నియమిస్తూ సంస్థ వ్యవస్థాపకుడు ముక్కెర సంపత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కవి సాయంత్రం అనేది సాహిత్య సంస్థలో ఒక భాగమన్నారు. రాధిక నరేన్ కవయిత్రిగా, రచయితగా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారని, ఈ నేపథ్యంలో ఆమెను నియామకం చేసినట్లు, ఈ నియామకం రెండేళ్లపాటు కొనసాగుతుందని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం



పనులకు నిధులు లేక అవస్థలు

సొంత డబ్బుతో కొన్ని పనులకు వాడకం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 11: గ్రామ పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరుగుతోంది. అన్ని పనులు వారి మీదే పడుతుండడంతో పంచాయతీ కార్యదర్శులు ఆర్థికంగా మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైనాటి నుంచి కార్యదర్శులకు కష్టాలు మొదలయ్యాయి. గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యత మొత్తం కార్యదర్శులపైనే పడింది. ఆదాయానికి మించి నిర్వహణ ఖర్చులు అవుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ కార్యదర్శులే అప్పులు చేసి పంచాయతీలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీలో రావాల్సిన పన్నులు అంతంత మాత్రమే వసూళ్ల అవుతుండటంతో అప్పులు చేయక తప్పడంలేదు. ప్రస్తుతం 56 రకాల రికార్డులను నిర్వహిసున్నప్పటికీ కార్యదర్శులకు అదనంగా వాటర్ సప్లయికి సంబంధించి 7 రికార్డులను అప్పజెప్పడంతో పని ఒత్తిడి తప్పడంలేదు.

రాష్ట్ర ఫైనాన్స్ నిధులు కట్

పంచాయతీ అభివృద్ధికి గ్రామంలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు రాష్ట్ర ఫైనాన్స్ సెంట్రల్ ఫైనాన్స్ నుంచి వచ్చే గ్రాంటులను వినియోగిస్తుంటారు. కాగా, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం అంతంతమాత్రమే కావడంతో మైనరు రిపేర్లు, పండుగల వేళ గ్రామంలోని దేవాలయాల ముస్తాబు, ఇతరత్రా ఖర్చులకే సరిపోతుంటుంది. మిగతా భారం అంతా సెంట్రల్, స్టేట్ ఫైనాన్స్ నుంచే వచ్చే గ్రాంటులపైనే ఆధారం. గ్రామంలో ప్రతీ తలపై రూ.162 చొప్పున సెంట్రల్, స్టేట్ ఫైనాన్స్‌లు కేటాయిస్తాయి. ఆయా గ్రామాల జనాభా లెక్కన గ్రాంటును విడుదల చేస్తుంటారు. కాగా, సుమారు 22 నెలల నుంచి స్టేట్ ఫైనాన్స్ నుంచి వచ్చే గ్రాంట్ నిలిపివేయడంతో పంచాయతీల్లో పనులు చేయించడం కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారింది. కేంద్రం నుంచి వచ్చే గ్రాంటు మూణ్నెళ్లకోసారి వస్తుండటంతో అప్పటికే గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లు కుప్పగా తయారవుతోంది. మిగిలేది ఏమీలేక మిగతా ఖర్చులకు కార్యదర్శి జేబులో నుంచి వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది.

మల్టీపర్పస్ వర్కర్స్‌కు అందని వేతనాలు

గ్రామపంచాయతీ పరిధిలో నివసిస్తున్న జనాభా ఆధారంగా మల్టీపర్పస్ వర్కర్స్‌ను గత ప్రభుత్వం నియమించింది. 500 జనాభాకు ఒక్కరు చొప్పున విధుల్లోకి తీసుకుంది. అయితే వీరికి గ్రామపంచాయతీ నుంచి వచ్చే ఆదాయం నుంచే ఒక్కొక్కరికి నెలకు రూ.9,500 జీతాలు చెల్లించాలని జీవో జారీ చేసింది. యేడాదికోసారి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం గ్రామ అవసరాలకే సరిపోక మల్టీపర్పస్ వర్కర్స్ మూడు, నాలుగు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మానవత్వం ఉన్న కార్యదర్శులు ఖర్చులో ఖర్చుంటూ అక్కడక్కడా వర్కర్స్‌కు చేతనైనంత ఆర్థిక సహాయం చేసి ఆదుకుంటున్నారు.

కార్యదర్శులకు యాప్‌ను తొలిగించాలి..

జె. అశోక్, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు

ప్రతీరోజు గ్రామంలోని నర్సరీ, శ్మశానవాటిక, చెత్తసేకరణ లాంటి 10 అంశాలకు సంబంధించి ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేయాలంటున్నారు. యాప్‌ను తొలిగించాలి. కారోబార్‌లను మల్టీపర్పస్ వర్కర్స్‌లో చేర్చడం వల్ల సుమారు 65 రికార్డ్‌లను నిర్వహించడం కష్టంగా ఉంది. కారోబార్లను కార్యదర్శులకు సహాయకులుగా నియమించాలి. పంచాయతీల అవసరాలకు సరిపడా నిధులులేక జేబుల్లో నుంచి పెట్టుబడి పెట్టి ఆర్థికంగా కుంగిపోతున్నాం. ఆ సమస్యను పరిష్కరించాలి.

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

కాటారం, ఏప్రిల్ 11: మండలంలోని ఇబ్రహీంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఎస్సీ కాలనీకి చెందిన పలువురు మహిళలు గురువారం ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదంటూ ఆందోళన చేపట్టారు. గత కొన్ని రోజులుగా నీళ్లు సరిగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మల్లక్క, సమ్మక్క, లక్ష్మి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

మహాముత్తారం, ఏప్రిల్ 11 : మండలంలోని కనుకునూర్ గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో గురువారం భూపాలపల్లి జిల్లా అసిసెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లింగాచారి ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 లీటర్ల గుడుంబా, 50 కిలోల చక్కెర, 50 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 2400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

బాంబులగడ్డలో ముమ్మర తనిఖీలు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఏప్రిల్ 11 : జిల్లా కేంద్రంలోని బాంబులగడ్డలో భూపాలపల్లి ఎస్సై పవన్‌కుమార్ గురువారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో విస్తృతంగా తనిఖీలు సాగుతున్నాయి. ఇందులో భాగంగానే బాంబులగడ్డలో భూపాలపల్లి జాతీయ రహదారిపై వచ్చివెళ్లే వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్సులు, కార్లు, ఇతరత్రా ప్రైవేటు వాహనాలను ఆపి తనిఖీ చేసి పంపించారు. ఈ సందర్భంగా వాహనదారులకు, ప్రయాణికులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 11 : మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పోగొట్టుకున్న ఫోన్లను పోలీసులు గురువారం తిరిగి వారికి అప్పగించారు. గ్రామానికి చెందిన చీర్ల సత్యనారాయణ రెడ్డి, తాజుద్దీన్‌లు గత నెల రోజుల క్రితం బైక్‌పై వెళ్తూ ఫోన్‌లు పోగొట్టుకోగా స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్‌లో సెల్‌ఫోన్ల వివరాలను నమోదు చేసిన పోలీసులు ట్రేస్ చేసి వాటిని బాధితులకు అప్పగించారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను టెక్నాలజీ ఉపయోగించి గుర్తించడంతో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ సింధూజను ఎస్సై అభినందించారు. కాగా, తమ ఫోన్లను తిరిగి అప్పగించిన పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

కారు ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ మండల కమిటీ


కాటారం, ఏప్రిల్ 11 : మండల కేంద్రంలో గురువారం కారు ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ మండల కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఓనర్లు, డ్రైవర్లు సమావేశమై ఎన్నిక నిర్వహించారు. ఇందులో మండల కమిటీ అధ్యక్షుడిగా మంతెన సతీష్, ఉపాధ్యక్షుడిగా కారెంగుల సతీష్‌లతో పాటు కార్యవర్గం ఎన్నికైంది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు కాటారం ఎస్సై అభినవ్‌ను కలిసి శాలువాతో సన్మానించగా, ఎస్సై నూతన కమిటీ బాధ్యులను అభినందించి రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

మంథని అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా విలాస్‌రావు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 11 : పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గల మంథని అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎరవెల్లి విలాస్‌రావు గురువారం నియమితులయ్యారు. రానున్న ఎంపీ ఎన్నికల నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన సేవలను గుర్తించిన అధిష్ఠానం పార్లమెంట్ ఎన్నికల్లోనూ వినియోగించుకునేందుకు మరో అవకాశం కల్పించిందని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మంథని నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ వచ్చేలా కృషి చేస్తానని విలాస్‌రావు పేర్కొన్నారు.

ఎన్నికల విధులు నిర్వహించినా అందని అలవెన్సులు

కాకతీయఖని, ఏప్రిల్ 11 : సింగరేణి సంస్థలో పనిచేస్తూ గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల విధులు నిర్వహించిన తమకు టీఏ, డీఏ అలవెన్సులు చెల్లించలేదని భూపాలపల్లి ఏరియా సింగరేణి క్లరికల్ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఏరియా నుంచి 111 మంది క్లర్క్‌లు ములుగు జిల్లా, పెద్దపెల్లి జిల్లాలోని మంథనిలో ఎలక్షన్ డ్యూటీలు చేశామని పేర్కొన్నారు. అయితే తాము డ్యూటీలు చేసి నాలుగు నెలలు గడిచినప్పటికీ సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం కానీ అలవెన్సులు చెల్లించలేదని పేర్కొన్నారు. ఎస్‌సీసీఎల్ గైడ్‌లైన్స్ ప్రకారం సింగరేణి ఉద్యోగి ఔట్ డ్యూటీ(ఓడి) చేస్తే రూ.650 చెల్లించాలని తెలిపారు. మంథనిలో విధులు నిర్వహించిన ఒక్కో ఉద్యోగికి రూ.2,450 రావాలని, ములుగులో విధులు నిర్వహించిన ఒక్కో కార్మికునికి రూ.2,270 అలవెన్సుల కింద రావాలని పేర్కొన్నారు. పోలింగ్ రోజున సెలవు దినమైనప్పటికీ తాము విధులు నిర్వహించామని, అయితే తమకు డబుల్ మస్టర్ కట్టించాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యం కట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి అలవెన్సులు చెల్లించకుండానే మళ్లీ పార్లమెంటు ఎన్నికల్లో విధులు నిర్వహించాలంటూ 114 మంది క్లర్క్‌లకు డ్యూటీలు వేస్తున్నారని తెలిపారు. తమకు రావాల్సిన అలవెన్సులతో పాటు అసెంబ్లీ ఎన్నికల రోజు డబుల్ మస్టర్ పడేలా న్యాయం చేయాలని గతంలో జీఎం శ్రీనివాసరావుకు విన్నవించామని వారు పేర్కొన్నారు.



WANTED
★ Wanted Teachers & Telecallers to teach 8th -10th Maths & Science Full time / Part time. Salary:10000/- Summer Programme. Near KUC, HNK. Cont : 9849157056
AJW-188056

HOUSE FOR SALE
★ ములుగు రోడ్ కాకతీయ కెనాల్ కన్నెముల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న Independent House అమ్మకానికి కలదు. సెల్ : 7660008666, 8309035091
AJW-27517

WANTED
★ హనుమకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్స్, సెక్యూరిటీగార్డ్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 12,000/- - 14,000/-. 8గంll - 12గంllలు కలవు. సం.ప్ర సెల్ : 9000463426
AJW-188018

HOUSE FOR SALE
★ ఉర్సు గుట్ట మండి కాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్ ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్ : 7660008666, 8309035091
AJW-27518

WANTED
★ SOUS CHEF for Newly Opening Multi - Cuisine Restaurant in VIJAYAWADA, AP (South Indian, Chinese & Continental). Exp: 8 + Years, Qual: Degree, Resume : m3344b@gmail.com
AJB-182035

PLOTS FOR SALE
★ Kuda Layout Plots for Sale. Ready to House Construction at Near Gorrekunta, Pothurajpally, Warangal. Contact : Srikanth. 7013397258, 8328168015
AJW-188052

FLATS FOR SALE
★ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్‌కి SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్ : 7660008666, 8309035091
AJW-27516

PLOTS FOR SALE
★ Kuda Layout Plots for Sale. Ready to House Construction at Near KITS College, Erragattu Gutta, Ambala Road, HNK. Contact : Srikanth. 7013397258, 8328168015
AJW-188051

PLOTS FOR SALE
★ GWMC & KUDA అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో అమ్మబడును. కేవలం 15,000/-లకు గజం మాత్రమే. సంప్ర 9849992488
AJW-5863

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 11 : జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదినాన్ని గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. భూపాలపల్లి పట్టణం సీఆర్‌నగర్‌లోని ఈద్గా, మండలాల్లోని మసీదులు సందడిగా మారాయి. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ మాసమంతా కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు పాటించి పండుగను జరుపుకున్నారు. ప్రత్యేక వంటకాలు చేసుకుని విందు ఏర్పాటు చేసుకున్నారు. రంజాన్ రోజు దానధర్మాలు చేస్తే శుభాలు కలుగుతాయని భావించి కొందరు ముస్లింలు పేద ప్రజలకు బట్టలు, బియ్యం దానం చేశారు. దీని ద్వారా పాపాలు తొలిగిపోయి సంపూర్ణ దైవ దర్శనం సిద్ధిస్తుందని ముస్లిం సోదరులు విశ్వసిస్తారు.

● కాటారం :మండలంలో ఈద్-ఉల్-ఫితర్(రంజాన్) వేడుకలు ఘనంగా జరిగాయి. పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలతో అలాయ్ బలాయ్ తీసుకుని ఈద్ ముబారక్ తెలిపారు. దేవరాంపల్లి, గారెపల్లి, ఇబ్రహీంపల్లి, చింతకాని, విలాసాగర్, గంగారం, అంకుసాపూర్ గ్రామాల్లోని మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు తోట జనార్ధన్, రవీందర్‌రావు, పలు పార్టీల నాయకులు ప్రభాకర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి,తిరుపతిరెడ్డి, ఫిరోజ్‌ఖాన్, నాయిని శ్రీనివాస్, చీమల సందీప్, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అజీజ్, ముస్లిం పెద్దలు సిద్దిఖ్, చోటేమియా, దాదామియా, అమీర్, నసీర్, అన్వర్, బాజీ, యాకూబ్, ఇంతియాజ్, మంజూర్, ఖాలిక్ ,బాబర్, ఇర్ఫాన్, మస్తాన్ పాల్గొన్నారు.

● గణపురం : మండల వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రేమ, సోదరభావం, శాంతికి ప్రతీకనే రంజాన్ అని కొనియాడారు.

● చిట్యాల : రంజాన్ పండుగను మండల వ్యాప్తంగా ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చిట్యాల, చల్లగరిగ, ఒడితల, నైన్‌పాక, గోపాలపురం గ్రామాల్లో ప్రత్యేక నమాజులు చేసి ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు రాజ్‌మహ్మద్, అజ్మత్‌మియా, హైదర్‌పాషా, షఫీ, అక్బర్, షేక్‌హుస్సేన్, మహమ్మద్ యూసఫ్, జలీల్, మునీర్, అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ రూరల్ : పలిమెల, మహదేవపూర్ మండలాల్లో రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. నెల రోజులుగా పవిత్ర రంజాన్ మాసంలో కఠిన ఉపవాస దీక్షలు గురువారంతో ముగిసాయి. కొత్తబట్టలు ధరించి ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు అలయ్ బలయ్ చెప్పుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్లతో పాటు గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నా పెద్దా అందరు పండుగ సందర్భంగా కొత్త దుస్తులు ధరించి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రంజాన్ వేడుకల్లో ఎంపీ కవిత, ఎమ్మెల్సీ

ఏటూరునాగారం : ఏటూరునాగారం మండల కేంద్రం తాళ్లగడ్డ ప్రాంతంలోని ఈద్గా వద్ద నిర్వహించిన రంజాన్ పండుగ వేడుకల్లో బీఆర్‌ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు కాకు మార్రి లక్ష్మీనరసింహారావులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులకు స్వీట్లు తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమన్నారు. ప్రతి ఏడాది హిందు ముస్లిం సోదరులు కలిసి రంజాన్ పర్వదినాన్ని జరుపుకొని మతసామరస్యాన్ని చాటుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఎమ్.వలీబాబా ఇంట్లో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో జుమా మసీద్ చైర్మన్ ఎమ్డీ.సలీం, ఎమ్డీ. అజ్మత్‌ఖాన్, ముజీఫ్, ఆజాద్, ఆరిఫ్, కైసర్, అప్సర్, ఇమ్రాన్, గాని, ముస్లిం పెద్దలుపాల్గొన్నారు.

● తాడ్వాయి : మండల వ్యాప్తంగా ముస్లింలు పవిత్ర రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తాడ్వాయి, కాటాపూర్, బీరెల్లి, రంగాపూర్, గంగారం, లింగాల, పోసాపూర్ తదితర గ్రామాల్లోని ముస్లింలు ఉదయం ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాటాపూర్‌లో జరిగిన వేడుకల్లో గ్రామస్తులు వెంకటేశ్వర్లు, సత్యం, మర్రి నరేష్, శనిగరం చిరంజీవి, ముత్తినేని లక్ష్మయ్య, ఆలం సాంబశివరావు, కోడి సతీష్, ముజావర్ హుస్సేన్, ముస్లిం మతపెద్దలు, యువజన సంఘాల నాయకులు, తాడ్వాయిలో సుజావుద్దీన్, సద్దాంహుస్సేన్, షరీఫ్, రియాజ్, రాజ్‌మహ్మద్, మస్తాన్, అలీం, రఫిక్, షఫీక్, అక్బర్‌పాషా, అయూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు : మండలంలో రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు ధర్మవరం, పేరూరులో మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం సోదరులకు పలువురు ఈద్ ముబారక్ తెలియజేశారు.

● వెంకటాపురం(నూగూరు): మండలంలో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే స్నానాలాచరించిన ముస్లింలు కొత్త దుస్తులు ధరించి పిల్లాపాపలతో కలిసి మార్కెట్ యార్డు ఆవరణలో నమాజ్ చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకుని మిత్రులకు మిఠాయిలు పంచిపెట్టారు.

● మంగపేట : మండలంలోని కమలాపురం, మంగపేట, రాజుపేట,పూరేడుపల్లి, దోమెడ, తిమ్మంపేట, కోమటిపల్లి తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలు, మజీద్‌ల వద్దకు పెద్దలు, యువకులు వెళ్లి నమాజ్‌లను మత గురువులతో చేసుకున్నారు. అనంతరం తమ ఇళ్లలో బంధు మిత్రులకు కుటుంబ సభ్యులతో తేనీటి విందులు ఇచ్చారు.

ఈ కార్యక్రమాల్లో మత గురువులు, రాజకీయ ప్రముఖులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.


భూపాలపల్లి సీఆర్‌నగర్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ఏటూరునాగారంలో ప్రార్థన చేస్తున్న ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ముస్లింలు


కాటారంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, ప్రజాప్రతినిధులు


వెంకటాపురంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టిప్పర్

» ఇరువురికి స్వల్ప గాయాలు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఏప్రిల్ 11: ఓ ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఇరువురికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని సుభాష్‌కాలనీకి చెందిన ఓంకార్ అనే యువకుడు తన స్నేహితుడితో కలిసి మంజూర్‌నగర్‌కు వెళ్లి తిరిగి భూపాలపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో మార్గ మధ్యలో స్వాగత్ రెస్టారెంట్ ఎదురుగా వెనకాలే వచ్చిన టిప్పర్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ఇరువురు కిందపడిపోయి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆ ద్విచక్ర వాహనం లారీ కింది భాగంలో పడటంతో ధ్వంసమైంది. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేయొద్దు

» ఇరిగేషన్ డీఈ బసవప్రసాద్

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 11 : అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి డివిజన్ ఇరిగేషన్ డీఈ బసవప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రైతులు అనుమతులు తీసుకొని ట్రాక్టర్ల ద్వారా తమ పొలాల్లో పోసుకోవాలని సూచించారు. చెరువుల్లో మట్టి తవ్వకాలు మాత్రమే నిర్వహించాలన్నారు. పగలు మాత్రమే రైతులు మట్టి తవ్వకాలు జరిపించాలని, రాత్రి సమయాల్లో ఎటువంటి తవ్వకాలు చేయొద్దని కోరారు. అలాగే దొమ్మటిపల్లి చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో బుధవారం రాత్రి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. రైతులే మట్టిని తమ చేలల్లో పోసుకుంటున్నారని అధికారులు గుర్తించారు. రాత్రిళ్లు మట్టి నడపొద్దని రైతులకు సూచించారు. దొమ్మటిపల్లి చెరువును పరిశీలించిన వారిలో భూపాలపల్లి తహసీల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ బసవప్రసాద్, ఆర్ఐ ప్రదీప్, సర్వేయర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మైనారిటీల సంక్షేమం కోసం బీజేపీ కృషి


మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

మంగపేట, ఏప్రిల్ 11 : దేశంలోని మైనారిటీలు మూడవసారి నరేంద్రమోదీ ప్రధాని కావడానికి తోడ్పడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం బీజేపీ నాయకులతో కలిసి పర్యటించి ముస్లింలకు రంజాన్ పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు బీజేపీ నేతలకు తేనీటి విందులను ఇచ్చారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలు నరేంద్రమోదీ మళ్లీ ప్రధానమంత్రి కావాలని కోరుకుంటున్నారని, అందులో ముస్లిం, మైనారిటీలు కూడా ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమాల్లో బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల కృష్ణగౌడ్, జిల్లా కార్యదర్శులు పొదెం రవిందర్, కర్ర సాంబశివరెడ్డి, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.యాకూబ్‌పాషా, జిల్లా అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే కృషి


ములుగులో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క


భూపాలపల్లిలో మహాత్మా జ్యోతిబా పూలే వేడుకల్లో పాల్గొన్న భౌద్ధ మహాసభ నాయకులు


మహదేవపూర్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జయంతి వేడుకల్లో మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 11 : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలేనని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మహాత్మాజ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు జరగగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది జ్యోతిరావు పూలేననిఅన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. పూలే జయంతి వేడుకలు ములుగులోని సీఐటీయూ కార్యాలయంలో జరగగా రాజేందర్ పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గుండెబోయిన రవిగౌడ్, నీలాదేవి, కవిత, రమాదేవి, కృష్ణకుమారి, శ్రావ్య, రజిత, కవిత, ఇందు పాల్గొన్నారు.

● మంగపేట : సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమాల్లో అంబేద్కర్ యువజన సంఘం మండల ఇన్‌చార్జి బాసారి హరికృష్ణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దిగొండ కాంతారావు, ఆత్మ మాజీ చైర్మన్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, బీసీ సంఘాల నాయకులు పూజారి సురేందర్‌బాబు, లోక్ సత్యంయాదవ్, స్వామి యాదవ్, దళిత సంఘాల నాయకులు ఎల్పీ.ముత్యాలు, వై.వీరస్వామి, బోడ బొర్రయ్య, ఎల్పీ.రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

● భూపాలపల్లిటౌన్ : భూపాలపల్లి పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆశాఖ కార్యనిర్వాహక అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశ మొదటి సంఘ సంస్కర్తగా పేరు గడించి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ నాయకులు కోల శ్యాం, శివరాజ్, రవి, భార్గవ్, కృష్ణస్వామి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● కాటారం : మండలంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో బీఎస్పీ మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి మౌలానా, ప్రజా సంఘాల నాయకులు పురుషోత్తం, బాపు తదితరులు పాల్గొన్నారు.

● గణపురం : మండలంలోని కేటీపీపీలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను సీఈ సిద్దయ్య ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్టులోని సీఈ కార్యాలయంలో పూలే చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ పూలే ఎంచుకున్న మార్గం అందరికీ ఆచరణీయమని కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాలు ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు, ఇంజనీరింగ్ అధికారులు, పలు అసోసియేషన్‌ల నాయకులు పాల్గొన్నారు.

● చిట్యాల : సామాజిక ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహనీయుడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుల్ల మల్లయ్య, సరిగొమ్ముల రాజేందర్, దొడ్డి కిష్టయ్య, సంగి రవి, యుగంధర్, అనీల్‌కుమార్, పుల్ల ప్రతాప్, మాసు రమేష్, రాజమౌళి, తిరుపతి పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా యువజన సంఘం మండల అధ్యక్షుడు మంగళపల్లి శ్రీనివాస్ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, నాయకులు బండారి విజయ్‌కుమార్, శనిగరపు శ్రీనివాస్, రవికుమార్, ఎల్దండి చంద్రబోస్, బండారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ రూరల్ : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను మహదేవపూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీసీ నాయకుడు సముద్రాల తిరుపతిరావు ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ వద్ద గల పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జడ్పీటీసీ గుడాల అరుణ, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు కోట రాజబాపు, మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు, ఎంఆర్‌పీఎస్ మండలాధ్యక్షుడు సురేష్, బీసీ సంఘం నాయకులు పంతకాని శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఆకుల శ్రీధర్, కలికోట వరప్రసాద్, వెన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మథీన్, పోటు మల్లారెడ్డి, సముద్రాల రాజశేఖర్, సందీప్, బీసీసంఘం నాయకులు పాల్గొన్నారు.

● మల్హర్: మండలకేంద్రమైన తాడిచర్ల, కొయ్యూర్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాడిచర్లలో ఎమ్మార్పీఎస్, కొయ్యూర్‌లో జాతీయ బీసీ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేసారపు నరేష్, జాతీయ బీసీ సంఘం జిల్లా ఇంచార్జి విజయగిరి సమ్మయ్య, సిద్ధ లింగమూర్తి, మంథని సమ్మయ్య, లకావత్ నవేందర్, మమత, తిరుపతి, రజిత, ముత్తయ్య, ఇందారపు రాజేష్, రామయ్య, రమేష్, సాగర్, అరుణ్, హేమంత్ పాల్గొన్నారు.

మంత్రి సీతక్క కాన్వాయ్ తనిఖీ

ములుగు, ఏప్రిల్ 11: రాష్ట్ర మంత్రి సీతక్క కాన్వాయ్‌లోని వాహనాలను పోలీసులు గురువారం తనిఖీ చేశారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ములుగుకు తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మల్లంపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు.

మిషన్ భగీరథ నీటి వినియోగంపై అవగాహన

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 11 : మండలంలోని ముకునూరుపాలెం గ్రామంలో మిషన్ భగీరథ నీటి వినియోగంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ కిరణ్ మాట్లాడుతూ గ్రామస్థులు మిషన్ భగీరథ నీటిని తాగునీటిగా వాడుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, మిషన్ భగీరథ ఏఈ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ములుగు, ఏప్రిల్ 11 : ములుగు జిల్లాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. కన్నాయిగూడెం మండలానికి చెందిన రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు పల్ల బుచ్చయ్య, వెంకటాపూర్ మండలం పాలంపేటకు చెందిన రామప్ప పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు సహా పలువురు కాషాయం తీర్థం పుచ్చుకున్నారు. హనుమకొండలో గురువారం జరిగిన కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్, జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

వాజేడు, ఏప్రిల్ 11 : మండలంలోని అర్లగూడెం సమీపంలో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. గత నెల 28న అర్లగూడెం సమీపంలో కన్నెబోయిన సమ్మయ్యఅనే రైతు మొక్కజొన్న పంట రక్షణ కోసం విద్యుత్ సరఫరాతో కూడిన ఇనుప కంచెను వేశాడు. మూత్ర విసర్జనకోసం వెళ్లిన అభినయ్(18)అనే విద్యార్థి ఇనుప కంచెకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో హనుమకొండలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. అభినయ్ తల్లిదండ్రులు నరేష్, శోభలది గోవిందరావుపేట మండలం చల్వాయి కాగా, మండలంలోని చెరుకూరులో నివసిస్తున్నారు. అభినయ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేశాడు. అభినయ్ వైద్యం నిమిత్తం సుమారు రూ.18 లక్షల వరకు ఖర్చు కాగా, చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. అభినయ్ స్వస్థలం చల్వాయిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా అక్రమంగా విద్యుత్ సరఫరాతో కూడిన ఇనుప కంచె వేసిన రైతుపై కేసు నమోదు చేసినట్లు వాజేడు ఎస్సై గతంలో వెల్లడించారు.

మండలంలో నేతల పర్యటన

మంగపేట, ఏప్రిల్, 11:జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవితలు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కమలాపురం, పొద్మూరు, మంగపేట, గంపోనిగూడెంలో ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ శ్రేణులు గ్రూపులుగా విడిపోకుండా కలిసికట్టుగా ఉండి తమ ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలను వివరించి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవితను ఓట్లు వేయించి గెలిపించాలని కోరారు.

అంధకారంలో జాతీయ రహదారి

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 11 : అది జాతీయ రహదారి.. రాత్రైతే చాలు ఆ రోడ్డుపై ఏమీ కనిపించదు.. రోడ్డు పూర్తై మూడేండ్లు కావొస్తున్నా రహదారిపై వీధిలైట్లు వెలగడం లేదు. మహదేవపూర్ మండల కేంద్రం మీదుగా ఉన్న జాతీయ రహదారి 353(సీ) పరిస్థితి ఇది. మహదేవపూర్ మండల కేంద్రం మీదుగా వెళ్లే ఈ రహదారి కాటారం వైపు సుమారుగా కిలోమీటరు, కాళేశ్వరం వైపు అర కిలోమీటరు మేర ఉంది. రోడ్డు పూర్తయిన కొత్తలోనే సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి కనెక్షన్ సైతం ఇచ్చారు. రోడ్డుకు ఇరువైపులా గ్రిల్స్‌తో పాటు ఫుట్‌పాత్, పార్కింగ్ ప్రదేశాలను అసంపూర్తిగానే వదిలేశారు. సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయి సుమారు మూడేండ్లు కావొస్తున్నా ఇప్పటికి ఒక్కసారి కూడా వెలిగిన దాఖలాలు లేవు. ఇదే జాతీయ రహదారిపై ఉన్న కాటారం మండల కేంద్రంలో మాత్రం లైట్లు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. అక్కడి ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవతోనే లైట్లు వెలుగుతున్నాయని, ఇక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో రహదారి అంధకారంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. జాతీయ రహదారిగా ఏర్పడక ముందు కనీసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు వెలిగేవని.. ఇప్పుడు అవి కూడా లేకపోవడంతో రాత్రివేళల్లో రోడ్డంతా చీకటిగా మారుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.